# బాలానగర్ పోక్సో కేసులు"పాపంపై పాశవికత్వం.. న్యాయస్థానం కఠిన తీర్పు


**-- నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష...**



**బాలానగర్ ఏప్రిల్ 25 ( పీపుల్స్ న్యూస్):** చిన్నారులపై జరిగే లైంగిక నేరాల పట్ల కోర్టులు ఎంత కఠినంగా వ్యవహరిస్తున్నాయో మరోసారి స్పష్టమైంది. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2017లో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి కోర్టు 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలోని ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఎం. వెంకటేశ్వరరావు శుక్రవారం ఈ మేరకు తీర్పు ప్రకటించారు. కేసు వివరాల ప్రకారం, నిందితుడు కొర్ర శివశంకర్ అలియాస్ రాజు (41) కూలీగా పనిచేస్తూ యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ సమీపంలోని ఎల్.ఎన్. నగర్‌లో నివసించేవాడు. అతని స్వగ్రామం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా తుమ్మలాల్ గ్రామం. 2017లో చిన్నారిపై లైంగిక దాడికి యత్నించడం మాత్రమే కాకుండా, ఆమెను అక్రమంగా నిర్బంధించిన ఘటన వెలుగులోకి రావడంతో బాలానగర్ పోలీసులు పోక్సో చట్టం మరియు ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ సుదీర్ఘంగా కొనసాగి, అన్ని సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం కోర్టు నిందితుడిని దోషిగా తేల్చింది. తీర్పులో భాగంగా, ఐపీసీ సెక్షన్ 376 తీ/ష 511 కింద 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించగా, ఐపీసీ సెక్షన్ 342 కింద అదనంగా రూ.1,000 జరిమానా విధించారు. ఈ తీర్పుతో బాధిత కుటుంబానికి న్యాయం జరిగినట్టుగా స్థానికులు భావిస్తున్నారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవం తంగా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంతోషి కుమారి, దర్యాప్తు అధికారి పి. భిక్షపతిరావు, ప్రస్తుత బాలానగర్ సీఐ టి. నరసింహరాజును ఉన్నతాధికారులు అభినందించారు. అలాగే కేసు విచారణలో కీలక పాత్ర పోషించిన సిబ్బంది కృషిని కోర్టు ప్రశంసించింది. చిన్నారులు, మహిళలపై జరిగే నేరాల పట్ల రాజీ పడబోమని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించే దిశగా కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతా యని పోలీస్ శాఖ స్పష్టం చేసింది. ఈ తీర్పు సమాజానికి ఒక గట్టి హెచ్చరికగా నిలిచింది.

# రాగిణి యాదయ్యకు ప్రతిష్టాత్మకమైన "దళితరత్న" అవార్డు



**జూబ్లీహిల్స్ : ఏప్రిల్ 24 (పీపుల్స్ న్యూస్)** జూబ్లీహిల్స్ ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త రాగిణి యాదయ్యకు ప్రతిష్టాత్మకమైన "దళితరత్న" అవార్డు లభించడం స్థానికంగా విశేష స్పందనను రేకెత్తించింది. సమాజ సేవలో ఆయన చూపిస్తున్న అంకితభావం, ముఖ్యంగా దళిత వర్గాల అభ్యున్నతికి చేస్తున్న కృషి పట్ల గుర్తింపుగా ఈ అవార్డు లభించడం గర్వకారణంగా భావిస్తున్నారు. జూబ్లీహిల్స్‌లోని ఎస్పీఆర్ హిల్స్, కమలానగర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి చెందిన రాగిణి యాదయ్య, ఎన్నో సంవత్సరాలుగా సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటున్నారు. బస్తీలో తాగునీరు అందేలా ప్రభుత్వం దృష్టికి తీసుకోవడం. స్థానికంగా ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వారిని ఆసుపత్రికి తీసుకోవడం. ముఖ్యంగా దళిత సంఘాల ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ, సమాజంలో వెనుకబడిన వర్గాలకు అండగా తోడ్పాటును అందిస్తున్నారు. ప్రతి సంవత్సరం డా. బాబూ జగ్జీవన్ రామ్, డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా దళిత సంఘాల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రతినిధులను గౌరవించేందుకు "దళితరత్న" అవార్డును ప్రదానం చేస్తారు. ఈ క్రమంలో ఈ ఏడాది రాగిణి యాదయ్యను ఎంపిక చేయడం ఆయన సేవలకు లభించిన గొప్ప గుర్తింపుగా భావిస్తున్నారు.

ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర దళితసేన కార్యాలయంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి జాతీయ అధ్యక్షుడు జె.బి. రాజు, రాష్ట్ర అధ్యక్షుడు డా. గంట మల్లేష్ ముఖ్య అతిథులుగా హాజరై రాగిణి యాదయ్యకు అవార్డును అందజేశారు. సభలో పలువురు దళితసేన ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొని యాదయ్య సేవలను కొనియాడారు. అవార్డు అందుకున్న అనంతరం రాగిణి యాదయ్య మాట్లాడుతూ, ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను మోపిందని తెలిపారు. సమాజంలో ఇంకా ఎన్నో సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. ముఖ్యంగా యువతను సామాజిక సేవ వైపు మళ్లించాలని, సమానత్వం, న్యాయం కోసం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాగిణి యాదయ్యకు లభించిన "దళితరత్న" అవార్డు ఆయన వ్యక్తిగత విజయమే కాకుండా, సమాజ సేవకు అంకితమైన ప్రతి కార్యకర్తకు ప్రేరణగా నిలుస్తోంది. ఈ గౌరవం ఆయన సేవలకు మరింత ఊతమిచ్చి, భవిష్యత్తులో ఇంకా విశేషమైన సేవలు అందించేందుకు దారితీస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# విశారదన్ మహారాజ్ అరెస్టుపై నిరసనలు -- జాక్ నేతల తీవ్ర ఖండన

**మేడ్చల్--మల్కాజిగిరి జాక్ నేతల ఖండన**

**-- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు గొట్టె సురేష్**




**బాలానగర్ ఏప్రిల్ 25 ( పీపుల్స్ న్యూస్):**తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో జరిగిన ఘటనపై బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్, రాజ్యాధికార జాక్ నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్యా యత్నం చేసి 81 శాతం కాలిన గాయాలతో మరణించడంతో రాష్ట్రవ్యాప్తంగా విషాదం నెలకొంది. ఈ ఘటనపై స్పందించిన జాక్ రాష్ట్ర నాయకుడు డా. విశారదన్ మహారాజ్, మృతుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు వరంగల్ జిల్లా మాత్తోజిపేటకు బయలుదేరగా, పోలీసులు ఆయనను గృహ నిర్బంధం చేసి అనంతరం అరెస్టు చేసినట్లు సమాచారం. ఈ చర్యను మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా జాక్ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గొట్టె సురేష్ మాట్లాడుతూ ప్రజల తరపున పోరాడే నాయకుడిని అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ఒక వ్యక్తి మరణించిన తరువాత అతని అంతిమయాత్రలో పాల్గొనే హక్కును కూడా నిరాకరించడం దారుణమని విమర్శించారు. ప్రభుత్వంపై పలు ప్రశ్నలు లేవనెత్తిన ఆయన, ఇతర రాజకీయ పార్టీల నాయకులపై ఇలాంటి చర్యలు తీసుకోకపోయినా, విశారదన్ మహారాజ్‌ను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో వెల్లడించాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ ఉద్యమంపై భయంతోనే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ సందర్భంగా డా. విశారదన్ మహారాజ్‌ను వెంటనే విడుదల చేయాలని, ఈ ఘటనపై ప్రభుత్వం మరియు పోలీసు శాఖ స్పష్టమైన వివరణ ఇవ్వాలని జాక్ నేతలు డిమాండ్ చేశారు. అవసరమైతే మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా కూకట్‌పల్లి డిపోలో అమరుడికి నివాళులు -- ప్రభుత్వానికి కార్మిక నేతల గట్టి హెచ్చరిక

**-- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్**




**బాలానగర్ ఏప్రిల్ 25 ( పీపుల్స్ న్యూస్):**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసాపేట సర్కిల్ ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా భావోద్వేగ వాతావరణం నెలకొంది. అమరుడైన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కు కార్మికులు, నాయకులు కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూకట్పల్లి బస్ డిపో వద్ద కార్మిక సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్మికుల సమస్యలపై పరిష్కరించడంలో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ అద్దె బస్సులను ప్రోత్సహిస్తూ ఆర్టీసీని ప్రైవేటు పరం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. యూనియన్ ఎన్నికలను నిర్వహించకుండా కార్మిక సంఘాలను నిర్వీర్యం చేయడం వల్లే కార్మికులు ఆందోళనలకు దిగుతున్నారని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటం అవసరమని, అయితే బలిదానాలకు పాల్పడవద్దని కార్మికులకు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వంగాల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన మొండివైఖరిని వీడి ఆర్టీసీ జేఏసీతో చర్చలు జరిపి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల ని కోరారు. కార్మికులు ఒక్కటై పోరాడితే తప్పా ప్రభుత్వమైనా వెనక్కి తగ్గాల్సిందేనని హెచ్చరించారు. సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి కే. మనోచారి, ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు దావీద్, పార్టీ సభ్యులు రాములు, గంగన్న, రాజు గౌడ్ తదితరులు పాల్గొని కార్మికులతో సంఘీభావం వ్యక్తం చేశారు. సమ్మె ఉధృతమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం -- కార్మికుల మధ్య చర్చలు ఎప్పుడు ప్రారంభమవుతాయన్నది ఆసక్తికరంగా మారింది

# బాధ్యత గల విద్యార్థులే నేటి సమాజానికి బలమైన ఆధారం

**-- బాలానగర్ సీఐ నర్సింహా రాజు**




**బాలానగర్ ఏప్రిల్ 25 ( పీపుల్స్ న్యూస్):**సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వ 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో సంక్షేమ వారోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బాలానగర్ మండలంలోని బీసీ బాలుర వసతి గృహంలో వెల్ఫేర్ ఆఫీసర్ కమల్ దాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు స్థానిక సీఐ నర్సింహా రాజు, సహాయ అభివృద్ధి అధికారి గంగాధర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. అధికారులు హాస్టల్ అంతటా పర్యటించి విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, భోజన నాణ్యతను పరిశీలించి, విద్యాబోధన జరుగుతున్న తీరుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా చట్టాలు, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ?"నేటి తరం విద్యార్థులే రేపటి డ్రగ్స్ రహిత సమాజానికి నిర్మాతలు. యువత తమ కెరీర్‌పై దృష్టి సారించాలి తప్ప మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకూడదని ఆయన హెచ్చరించారు. ?అలాగే పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, కేవైసీ అప్‌డేట్ లేదా లక్కీ డ్రా పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. ఏదైనా సైబర్ మోసం జరిగినప్పుడు బాధితులు ఆలస్యం చేయకుండా 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది మరియు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

# తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా పాలన కాదు కార్పొరేట్ల పాలన ....

**-- ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం పాదయాత్ర**

**-- అర్హులైన ప్రతి పేదకు పింఛన్ ఇవ్వాలి**

**--- సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్ డిమాండ్**



**.బాలానగర్ ఏప్రిల్ 25 ( పీపుల్స్ న్యూస్):**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ మండలంలోని కుమ్మరి బస్తీ, ముదిరాజ్ బస్తీ, దాసరి బస్తీ, రాజుకాలని, సిబిర్ నగర్ ప్రాంతాలలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలను తెలుసుకునే పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన "6 గ్యారంటీలు" అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అర్హులైన పేదలకు పింఛన్లు అందకపోవడంతో వారు మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పింఛన్ల కోసం వెళ్లిన ప్రజలకు అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడం, కొత్త దరఖాస్తుల ప్రక్రియపై స్పష్టత లేకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రాంతాల్లో దోమల సమస్య అధికంగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఫాగింగ్ నిర్వహించకపోవడం వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే దోమల నివారణ చర్యలు చేపట్టి, రోజువారీగా ఫాగింగ్ చేయాలని డిమాండ్ చేశారు. శఅలాగే రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించకపోవడం, బోర్‌వెల్‌లకు చిన్నపాటి మరమ్మతులు చేయకపోవడం వల్ల తాగునీటి సమస్యలు తీవ్రమవుతున్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం. శంకర్, మండల కమిటీ సభ్యులు ఏ. విజయ, పి. శంకర్, చైతన్య, ధర్మరావు, నాయకులు సునీత, తాజ్ ఒద్దీన్, జోగారావు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి అమ్మి..

# ప్రైవేట్ భూమి కొనుగోలు

### పోలీసులకు కేటాయించిన కబ్జా... పేదల్ని మోసం చేస్తున్న కబ్జా రాయుళ్లు.





**కుత్బుల్లాపూర్ : ఏప్రిల్ 23 (పీపుల్స్ న్యూస్)** పోలీసులకు కేటాయించిన స్థలాలను కూడా వదలకుండా కబ్జా చేస్తున్న ముగ్గురు వ్యక్తుల దందా మరోసారి వెలుగులోకి వచ్చింది. అక్రమ సంపాదనకు అలవాటు పడి అడ్డగోలుగా భూములను ఆక్రమిస్తూ, పేద ప్రజల్ని లక్ష్యంగా చేసుకుని ప్లాట్లు విక్రయిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.సర్వే నంబర్ 307 పరిధిలోని భూములు హైడ్రా పరిధిలోకి రావని తప్పుడు ప్రచారం చేస్తూ అమాయకుల్ని నమ్మబలికిన ఈ కబ్జా రాయుళ్లు, కష్టపడి సంపాదించిన డబ్బులను పెట్టుబడి పెట్టిన పేదల్ని మోసం చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. తక్కువ ధరకు ప్లాట్లు ఇస్తామని చెప్పి వందల సంఖ్యలో కుటుంబాలను మోసం చేసినట్లు సమాచారం. ఇప్పటికే పలువురు బాధితులు తమ డబ్బులు పోయాయని, కొనుగోలు చేసిన ప్లాట్లకు ఎలాంటి చట్టబద్ధ హక్కులు లేవని తెలుసుకుని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణం చర్యలు తీసుకోకపోతే తాము రోడ్డున పడాల్సి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు.ఈ ఘటనపై సంబంధిత రెవెన్యూ, పోలీస్ అధికారులు దృష్టి సారించి కబ్జా రాయుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



**నిందితులకు శిక్షలు ఉండవా..? ప్రభుత్వ భూముల కబ్జాపై ప్రజల ఆగ్రహం.**



ప్రభుత్వ స్థలాలను అక్రమంగా కబ్జా చేస్తూ కోట్ల రూపాయలు ఆర్జించిన కబ్జారాయుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు. పేద ప్రజలను మోసం చేస్తూ ప్లాట్ల పేరుతో డబ్బులు వసూలు చేసిన నిందితులు, ఇప్పటికే భారీగా అక్రమ సంపాదన కూడబెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.స్థానికుల వివరాల ప్రకారం, ఈ కబ్జారాయుళ్లపై గతంలోనే పలు కేసులు నమోదైనప్పటికీ, పోలీసులు మరియు రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్ల వీరు మరింత ధైర్యంగా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమే ఈ మోసాలకు ప్రోత్సాహమిచ్చిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా, నిందితులు సేకరించిన డబ్బుతో నగరాన్ని విడిచిపెట్టే యత్నంలో ఉన్నారనే వార్తలు స్థానికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇది నిజమైతే వందలాది పేద కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ప్రజలు భయపడుతున్నారు.



ఈ నేపథ్యంలో, కబ్జా చేసిన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడంతో పాటు, బాధితుల నుండి వసూలు చేసిన డబ్బును తిరిగి ఇప్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని పోలీసులు ,న్యాయవ్యవస్థపై ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

